# జీవిత సత్యం

"ఇలారా అమ్మా సరోజా" అన్నాడు ధర్మయ్య. ఆ గదిలో అవతలిపక్కనకూర్చుని చీకటి నీడల్ని చూస్తున్న సరోజ, తండ్రి తనను ఎందుకు పిలుస్తున్నాడో అర్థంకాకపోయినా వట్టినే పిలవడం లేదని, ఏదో ముఖ్యమైన విషయమే మాట్లాడ్డంకోసమేనని అనుకుంటూ వచ్చి నుంచుంది 'ఏం నాన్నా' అంటూ.

" మరేం లేదమ్మా. నీ విషయమే కొంచెం మాట్లాడుదామనుకుంటున్నాను, రా కూర్చో" అన్నాడు ధర్మయ్య తను చెప్పదలచిన విషయం ఎలా చెప్పాలో ఆలోచించుకొంటూ.

తన విషయమేమై ఉంటుందా అన్న ఆలోచనతో తండ్రి ముఖంలోకి సూటిగా చూసింది సరోజ.

"మరేంలేదు. మంచిరోజు చూసుకుని నిన్ను తీసుకెళ్ళమని రాద్దామనుకొంటున్నాను" అన్నాడు ధర్మయ్య. అని, ఆమె ఏమంటుందోనని ఆమె ముఖంలోకి చూశాడు.

సరోజ ఏమీ అనలేదు. చాలాసేపటివరకూ పక్కకి ముఖంతిప్పి మౌనంగా కూర్చొని లేచిపోతూ "అప్పుడే తొందరేమొచ్చింది నాన్నా" అంది.

"అది కాదమ్మా, నామాట విను. ఇంతకాలం నువ్వు చిన్న పిల్లవుగనక ఎవరూ

ఏమీ అనలేదు. ఇప్పుడు నీకు పద్దెనిదేళ్ళు వచ్చాయి కదా. పెళ్ళయిన పిల్లవి. ఇంకా పుట్టింట్లోనే వుంచేస్తే అంతా ఏమనుకుంటారు? కిందటేడే పంపించేద్దామనుకుని చేతిలో డబ్బులేక ఆగిపోయాను. ఈ ఏడైనా పంపించకపోతే బావుండదు. రేపువచ్చేనెలలోనే మంచిరోజు చూసి అదీ అయిందనిపించేస్తాను. మళ్ళీ నీ గురించి ఆలోచించక్కర్లేదు" అన్నాడు తండ్రి.

"ఏమో నాన్నా. నాకు అక్కడకు వెళ్ళడం యిష్టంలేదు. నువ్వేమీ ఆ ప్రయత్నాలు మాత్రం చెయ్యొద్దు" అంటూ తండ్రి జవాబుకు ఎదురుచూడకుండా అవతలి గదిలోకి వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతున్న కూతురువంకే చూస్తూవుండిపోయాడు ధర్మయ్య. కూతురు అలా అంటుందని అతనికి తెలుసు. అందుకే యీ విషయం భార్య బదులు తనే చెప్పి ససేమిరా అంటే ఎలాగోలాగ ఒప్పిద్దాం అనుకున్నాడు. కాని సరోజ అదేమీ వినకుండానే వెళ్ళిపోయింది.

ధర్మయ్య గట్టిగా ఓ నిట్టూర్పు విడిచాడు. 'అల్లుడి గురించి అంతా అనుకుంటుండగా అది మాత్రం ఆలకించకుండా వుంటుందాయేం! చిన్నపిల్ల ! అవన్నీ ఆలకించి ఎంతగా భయపడిపోతోందో ఏమో. అందుకే లోలోపలే కుమిలిపోతున్న దానిలా ఎప్పుడు చూసినా అదోలా దిగాలుపడి వుంటుంది. ఇంతకూ దీన్ని అని ఏం లాభం, దాన్ని అనాలిగాని"

ఆలోచిస్తూ, ఆ పక్క గదిలోనుండి అంతా ఆలకిస్తూ అప్పుడే లోనికొస్తున్న వరహాలమ్మ వంక చూశాడు ధర్మయ్య. ఆచూపులోని భావం 'విన్నావా?' అన్నది గ్రహించి "ఊ" అన్నట్టుగా గట్టిగా మూలుగుతీసింది వరహాలమ్మ. ఆ మూలుగు ముళ్ళుగుచ్చు కున్నట్టు అనిపించింది ధర్మయ్యకు. కూతురి విషయంలో భార్య కల్పించుకోవడం ధర్మయ్యకు సుతారామూ యిష్టంలేదు. అది కల్పించుకోబట్టే యింతవరకు వచ్చిందని అతని అభిప్రాయం.

వరహాలమ్మ నెత్తిపట్టుకుని కూర్చుంటూ "ఏంజేస్తాం. ఖర్మ" అంది.

"అలా నెత్తిబాదుకోకపోతే ఆనాడేమైందీ ఆలోచన" చురచురా చూశాడు ధర్మయ్య. ఇలాటివన్నీ అలవాటయిన మనిషి గనుక మాట్లాడకుండా వూరుకుంది వరహాలమ్మ.

"నేనప్పుడు చెప్తే విన్నావూ. తమ్ముడని బావుకొని తిరిగావు. లక్షణంగా చదువుకొంటున్నాడు, రేపు రెండ్రోజులుపోతే ఉద్యోగంచేసి నాలుగురాళ్ళు సంపాదించుకుంటాడు, మేనరికం చేద్దాం అంటే వప్పుకున్నావూ? కాదు కూడదని, తమ్ముడు ఊడబొడుస్తాడని అయిదురోజులు అన్నంతినడం మాని,కోరి యీ సంబంధం చేసినందుకు దాని గొంతు నిలువునా కొయ్యడంతప్ప నువ్వు చేసిన ఘనకార్యమేమిటి? కూతురన్న అభిమానం నీకేగాని నాకుమాత్రం వుండదా?" ధర్మయ్య కోపాన్నంతా వెళ్ళగక్కి వీధి అరుగుమీద కెళ్ళి కూర్చున్నాడు.

వరహాలమ్మ ఎలా కూర్చొన్నది అలానే అరగంట వరకూ కూర్చుండిపోయింది. 'తనకు మాత్రం వుండదూ కూతురు సుఖపడాలనీ, దాని భారం పూర్తిగా వదిలిపోవాలనీ. ఆనాడు పెళ్ళిచేసేటప్పుడు తనేమైనా కలగందా? తమ్ముడన్న అభిమానంకొద్దీ కూతుర్నిచ్చి కట్టబెట్టింది. అప్పుడు తనకేం తెలుసు పెద్దయ్యాక యిలా తయారవుతాడని!. ఆ మాటకొస్తే చచ్చి స్వర్గాన్నున్న అత్తగార్ననాలి. ముసల్దాన్ని, మనవరాలి పెళ్ళి తను బతికుండగానే చేసెయ్యమని బలవంతంచేస్తే, ఆయనగారు కూడా తల్లిమాటకు తాళం వేసి మేనరికం చేద్దామనుకుంటుంటే, తను కల్పించుకుని ఆ సంబంధం యిటు తిప్పింది. అసలు ఆ వయసులో దానికి పెళ్ళేమిటి? ఆనాడు వాళ్ళు యీ ప్రయత్నం చెయ్యకపోతే దీనిగతి యిలా తయారవుతుందా? ఈ వయసులో హాయిగా కాపరం చెయాల్సిన సమయంలో గుండె చెరువై యింట్లో కళ్ళముందు దిగాలుపడి తిరుగుతుంటే కన్నందుకు అంతకు రెండింతలు దుఃఖంతో తను మాత్రం కుమిలిపోవడంలేదూ?' అసలు దీనికంతటికీ తను కారకురాలు కాదని ఆలోచించి పైటకొంగుతో కళ్ళు వత్తుకుని లేచి కూతురున్న గదిలోకి వెళ్ళింది వరహాలమ్మ.

గదిలో సరోజ సంజదీపం వెలిగించకుండానే మంచంమీద పడుకుని కిటికీగుండా బైట చెట్లగుబురుల కింద పరచుకుంటున్న మసకచీకట్లనుచూస్తూ, మధ్యమధ్య కారే కన్నీటిని తడుచుకుంటూ వుంది. వరహాలమ్మ గదిలో లైటు వెలిగించి కూతురు నిద్రపోవడంలేదని తెలుసుకుని, ఆ మంచంమీదే ఓ పక్కన కూర్చుని "చూడమ్మా" అంటూ అవతలికి చూస్తున్న కూతుర్ని తనవైపుకు తిప్పుకొంది.

తల్లికి కనిపించకుండా దాద్దామనుకున్న కన్నీళ్ళు ఆమె చూస్తుండగానే కారి కిందపడ్డాయి. "ఛా... ఏడుస్తున్నావా, ఊరుకో" అంటూ ఒక చేత్తో తలనిమురుతూ

మరో చేత్తో తడిచారల్ని తుడిచింది. కూతుర్ని దగ్గరకు తీసుకుని "నువ్వు చిన్నపిల్లవు. నీకింకా తెలీదమ్మా, రేపు మామయ్యకు ఉత్తరం రాయిస్తాను. జవాబు వచ్చాక మంచిరోజు చూసి కార్యం అయిందనిపిస్తే నీ భారం యిక వదిలిపోతుంది తల్లీ" అంది.

"బరువు తీరిపోతుందని గొంతు పిసికి చంపెయ్యలేకపోయావ్? పోనీ అంతకన్నా సులభం, ఏ మందో మాకో పెట్టెయ్యలేకపోయావ్" అంది సరోజ, అంతవరకు ఆలోచిస్తున్న తన స్థితికి తల్లే కారణం అని నిర్ణయించుకొంటూ.

"నువ్వా నన్నే అంటున్నావా సరోజా..." అని, మధ్యలోనే గొంతు గాద్గదికమై ఆగిపోయి కళ్ళు తుడుచుకుని "పోనీ నన్ననక యింకెవరి నంటావులే. కన్నందుకు ఏమన్నా పడాలి" అని తల నిమురుతూ "ఉత్తరం రాయమంటావు కదమ్మా" అంది.

సరోజ ఆట్టే ప్రసంగం చెయ్యకుండానే "ఊఁహు" అని అవతలి పక్కకు వత్తిగిల్లింది.

"అలా అనకూడదమ్మా, ఏదో నువ్వు విన్నవి ఊహించుకొని యిలా కుమిలిపోతున్నావు గాని నిజంగా మామయ్య అంత చెడ్డవాడుకాడు. వాడేదో నిన్ను తన్ని తిట్టి కష్టపెడుతుంటే నాకు యిష్టం అనుకున్నావా తల్లీ? ఆ మాత్రం నాకు తెలీదూ? పోనీ నువ్వనుకున్నట్టు చెడ్డాడే అనుకో. నువ్వు వెళ్తే వాడే బాగుపడతాడు. పెళ్ళాం రాకముందు అల్లరిచిల్లరిగా తిరిగిన వాళ్ళెంతమంది పెళ్ళాం వచ్చాక మిగిలినవాళ్ళకన్నా బాగా బతుకుతున్న వాళ్ళని చూళ్ళేదూ!" అంది వరహాలమ్మ.

"చెప్పానుగదూ, నేను అక్కడకు వెళ్ళనంటే వెళ్ళను" మొండికెత్తినట్టుగా అంది సరోజ.

వరహాలమ్మ యింకా ఏదో చెప్పబోయింది కాని సరోజ పక్క దుప్పటి తీసి తలనుండి పాదాలవరకు ముసుగుతన్ని యింకేమీ వినక్కరలేదన్నట్టుగా పడుకొంది ఇక ఏం చెప్పినా లాభంలేదనుకుని నిట్టూర్చి లేచి వెళ్ళిపోయింది వరహాలమ్మ.

తల్లి వెళ్ళిపోవడంతోనే లేచివెళ్ళి తలుపుగెడపెట్టి మంచంమీద కొచ్చి కూర్చుంది సరోజ. బయటంతా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా వుంది. ఒక్క సరోజ హృదయంలో మాత్రం తుఫానూ, సుడిగాలీ రెండూ కలిసివచ్చినప్పుడు ఎటూ వెళ్ళలేక ఆ సుడిగాలి పరిధిలోనే

పరిభ్రమిస్తున్నట్టుగా మనసు ఆలోచనల పరిధిలోనే గిరగిరా తిరుగుతూవుంది. వాటినుండి మరల్చుకుందామన్నా వీలుకావడంలేదు. అలసిపోయి అక్కడే మంచంమీదకు ఒరిగింది. అయినా నిద్రపట్టలేదు. ఆలోచన్లు నీడల్లా అంటిపెట్టుకునే వున్నాయి. చిన్నప్పుడు పెళ్ళినాటి జ్ఞాపకాల్లో తారట్లాడే ఆయన, ఆ తర్వాత పక్కింటి వరలక్ష్మి అంతా చెప్పగా ఊహించుకున్న ఊహల్లో ఆయన - ఆ రెండూ రెండువైపులా ఆమెను ఎదుర్కొంటున్నాయి. 'ఉహూ, చచ్చినా అక్కడకు వెళ్ళకూడదు' అనుకుంది.

రాత్రి భోజనంచేసి వచ్చి పడుకున్నాక కూడా ఆమె ఆలోచనలకు ముగింపు లేకపోయింది. నిద్రపట్టలేదు. మనసు నిండా అవే ఆలోచనలు-

'ఆయన గురించి వరలక్ష్మి తల్లితో చెప్తుండగా తను వింది. ఆవిడేమిటి, స్వయానా తండ్రి కళ్ళనీళ్ళు పెట్టుకొని ఒకనాటిరాత్రి తను నిద్రపోయానని భావించి గట్టిగానే తల్లితో చెప్తున్నాడు. 'చూసిచూసి పిల్లను ఆ దౌర్భాగ్యుడి చేతుల్లో పెట్టామే. ఇంతకన్నా ఆ దొడ్లో బావిలోకి దించినా కొంచెంమెరుగే. బండిదిగి ఊర్లో అడుగుపెట్టింది లగాయతు ఆ వూర్లో వున్నంతసేపూ ఎదురయిన ప్రతి ఎరుగున్న ముఖమూ అదేమాట–మీవాడు యీ మధ్య మరీ బలాదూర్‌గా తిరుగుతున్నాడండీ. పచ్చి రౌడీగా తయారయ్యాడు' అని.

ఆ మాటలు తండ్రి అంటున్నప్పుడు ఆ కంఠంలో సన్నని జీర తొణికిసలాడి ఆ తర్వాత బొంగురుపోయి అంతటితో ఆగిపోవడం తను చాటుగా వింది. వరలక్ష్మి చిన్ననాటినుండీ ఎంతో చనువుగా వుండేదల్లా పెళ్ళయి వెళ్ళిపోయి పుట్టింటికి మొదటిసారి వచ్చినప్పుడు ముందటి పరిహాసాలూ, చనువూచూపించకపోతే ఏమిటో అనుకుంది తను. ఆమె అత్తగారి వూరూ, తన తాతగారి వూరూ ఒక్కటే. ఆమె ఆ వూర్లో వున్నప్పుడు విన్నవీ కన్నవీ అన్నీ చెప్పింది. ఆమె చెప్పిన ప్రతి సంగతీ తను చాటుగా వింది. విన్నా తను చేసేదేమిటి, తన దురదృష్టాన్ని తలంచుకుంటూ తల బాదుకుని ఏడవడం తప్ప. అలా బయటికికూడా ఏడవలేక లోలోపలే కుమిలిపోవడమే తను చేయగలిగినదల్లా. తనని జీవితాంతం యీ కష్టాలు పడమని బొమ్మలాటగా ఆనాడు యీ పెళ్ళిచేశారు. పోనీ ఆ చేసేదిగూడా ఆలోచించి చెయ్యగూడదూ? అక్కడా స్వార్థమేనా? తమ్ముడికే యివ్వాలని అమ్మ పట్టుబట్టడమేమిటి; ఇవతల కన్నకూతురు ఏమయినా అంతేనేమో....'

ఎప్పుడో ఆమెకు తెలీకుండానే ఆవహించిన నిద్రలో ఆలోచనలు ఎగిరిపోయి ఆ స్థానంలో ఏదో పీడకల వచ్చి కరిగిపోయింది.

సరోజ ఉదయం లేచి మామూలు మనిషిలా తిరిగలేకపోయింది. ఇంట్లో ఎవరూ ఆమెను మళ్ళీ ఆ విషయమై కదపలేదుగాని రెండురోజులవరకూ ఆమెను ఆ ఆలోచనలు వదిలిపెట్టలేదు. ఆ తర్వాత మెలమెల్లగా అవి తొలగిపోయాయి.

పూర్తిగా ఆ విషయాలు మర్చిపోయి యింటిపనుల్లో మునిగిపోయివున్న సమయంలో వరలక్ష్మి పురిటికని పుట్టింటికి వచ్చింది. వరహాలమ్మ ఆరోజే ఆమెను పిలిపించి "తమ్ముడి విషయాలేమైనా తెచ్చావా?" అంది. అంతా తెలిసిన కూతురుకు చాటుచెయ్యడం దేనికని,కూతురువచ్చి కూర్చున్నా ప్రసంగం మార్చకుండానే అడిగింది.

"ఏం చెప్పనుపిన్నీ. అంతకుముందు ఎలా వున్నాడో యిప్పుడూ అంతే. ఆస్థంతా తగలబెడుతున్నాడని తాతయ్యకూడా వాడికి కార్యం కానిచ్చేసి వేరే కాపరం పెట్టిద్దాం అనుకుంటున్నాడు. దగ్గర్లోనే మంచిరోజు చూసి అదీ అయిందనిపించేద్దామనే వాళ్ళు చూస్తున్నారు. ఇదిగో నేను చెప్తున్నా విను పిన్నీ! భార్యవున్న దారివేరు. లేనిదారివేరు. ఏంచేస్తున్నా నాలుగుసార్లు అడ్డి అపేవాళ్ళుండాలి. లేకపోతే ఆ ఒదినలకేం కావాలి వీడేమైతే. ఇక తండ్రంటావా? ఆపే స్థితిలో లేడు. ఏమయినా మనపిల్ల జీవితం గనక మనమే త్వరపడి ఏదో - ఆ పనికూడా అయిందనిపించేసి పంపేస్తేనే మంచిది. ఎన్నాళ్లని యింట్లో వుంచుకొని దాని జీవితాన్ని నాశనంచేస్తాం?" అంది వరలక్ష్మి. పెళ్ళయి రెండేళ్ళే అయినా వందేళ్ళ అనుభవాన్నంతా జీర్ణించుకున్నదానిలా మాట్లాడింది.

"చూశావా అమ్మా!" అంది వరహాలమ్మ కూతుర్ని ఉద్దేశిస్తూ.

చూసేదేమీ లేదన్నట్టుగా లేచి వెళ్ళిపోయింది సరోజ. వెళ్ళిపోతున్న సరోజనుచూసి వరలక్ష్మి వరహాలమ్మ దగ్గిరకంటా వంగి "నీకు తెలీదు పిన్నీ వాడెలా తయారయ్యాడో. ఈ మధ్య దేన్నో తెచ్చి వుంచాడట?" అంది చాలా రహస్యంగా వినిపించీ వినిపించనంత నెమ్మదిగా.

వరహాలమ్మ ముక్కుమీద వేలేసుకుంది 'వీడికి యిది కూడానా!' అని.

సరోజ అవతలి గదిలోకి వెళ్తూ తల్లినిచూసి ఏమనుకుందో ఏమో దభీలున తలుపులు వేసుకుంది. "సరోజతో మాట్లాడివస్తాను పిన్నీ" అని వరలక్ష్మి లేచొచ్చి

తలుపులు తోసుకుంటూ గదిలోకి వచ్చింది.

"రా కూర్చో" అంది సరోజ.

"మీ అయన దగ్గర కెళ్ళనన్నావటేమే" అంది ఆశ్చర్యంగా.

"ఏం లేదు, ఆ విషయం యిప్పుడెందుకులే" అంది సరోజ. అని, ఆ సంభాషణని మార్చే ఉద్దేశంతో ఏదో చెప్పబోయింది గాని వరలక్ష్మి అడ్డుపడి "అది సరేగాని, ముందీ విషయం చెప్పు, మీ ఆయన దగ్గరికి ఎందుకెళ్ళవ్?" అని అడిగింది.

సరోజ ఏమీ జవాబు చెప్పలేదు. అయినా అసలు కారణం వరలక్ష్మికి తెలియనిదేమీకాదు. అందుకే ఆమె "భర్త ఎలాటివాడైనా కట్టుకున్న తర్వాత తప్పుతుందా సరోజా! ఇప్పుడెళ్ళనంటావ్. రేపెళ్ళనంటావ్. ఒకటిరెండు సంవత్సరాలు యిలా గడిపేసినా ఆ తర్వాతనన్నా వెళ్ళక తప్పదుకదా?..." అంది. పావుగంటసేపు ఆమెకు హితబోధ చేసింది.

సరోజ అదేమీ తలకెక్కించుకున్నట్టులేదు.ఆమె చెప్తోంటే బల్లమీది పుస్తకం పేజీలు తిరగేస్తూ బొమ్మలు చూస్తూ కూర్చుంది.

వరలక్ష్మి వెళ్ళొస్తానంటూ లేచింది. సరోజ గుమ్మంవరకూ వచ్చి, వెళ్ళిపోతున్న వరలక్ష్మిని చూస్తూ తనలో తనే నవ్వుకుంది. 'తన ఈడుపిల్ల యీ వరలక్ష్మి ముసలమ్మలా తనకి నీతులు చెప్తోందేమిటి? ఎలా అయినా పెళ్ళయ్యాక గడుసుదనం అదీ నేర్చేసింది. దీనికి పెద్దల తరహా వచ్చేసిందిసుమా' అనుకుంది.

ఆ రాత్రి ఒకమారు వరలక్ష్మి అన్న విషయాలు జ్ఞాపకం చేసుకుని ఆలోచించి 'ఏమయినా అక్కడకు వెళ్ళకూడదు. వెళ్ళినందువల్ల తనకి కష్టాలేకాని సుఖం లేదు. ఆ వుండేదేదో యిక్కడే వుంటేసరి' అని నిర్ణయించుకుంది.

ఆ తర్వాతకూడా చాలాసార్లు తల్లీ, తండ్రీ, వరలక్ష్మి చెప్పి చూశారు. అప్పటికీ సరోజ మెత్తబడలేదు. ఇంకా గట్టిగా చెప్తే ఏ అఘాయిత్యం చేస్తుందోనని భయపడి ఊరుకుని, సమయం చిక్కినప్పుడల్లా మంచిగా చెప్తుండేవారు. ఊకొట్టి ఊరుకునేది సరోజ. చెప్పిచెప్పి వాళ్ళుకూడా విసుగెత్తి వూరుకున్నారు, ఎప్పుడో దానికే బుద్ధి తిరుగుతుందని.

ఒకరోజు ప్రభాకరం వచ్చాడు. ఆ దగ్గరి వూళ్ళో స్నేహితుడి పెళ్ళికనివచ్చి,

మేనమామ వాళ్ళనికూడా చూసి వెళ్దామని వచ్చాడు. సరోజను ప్రభాకరానికి యివ్వలేదన్న కోపంకొద్దీ ఆ రెండిళ్ళకూ రాకపోకలు తెగతెంపులు చేసుకున్నారు. ధర్మయ్య తల్లి చనిపోయినప్పుడు మళ్ళీ మాటలు కలిసాయి.

చెల్లెలి కొడుకు ప్రభాకరం అంటే ధర్మయ్యకు మొదటినుంచీ యిష్టమే. వరహాలమ్మకు కూడా తమ్ముడిమీద అభిమానంకొద్దీ కూతుర్ని ప్రభాకరానికి యివ్వలేదుకాని, ప్రభాకరం అంటే బుద్ధిమంతుడ్ని, హాయిగా ఉద్యోగం చేసుకుంటున్నాడని మంచి అభిప్రాయమే వుంది. ' ఆ యిచ్చేది వీడికైనా యివ్వక పోయానే' అని అప్పుడప్పుడు బాధపడుతూ వుంటుందికూడా.

ప్రభాకరం దగ్గరకూర్చుని అతను చెప్పినవన్నీ విని "అయితే పెళ్ళెప్పుడు చేసుకుంటావబ్బాయ్?" అంది.

ప్రభాకరం చిరునవ్వు నవ్వుతూ రేపొచ్చే నెలలోనే. మొన్ననే నాన్న సంబంధం చూసి మాట్లాడి వచ్చాడు. కట్నం ఐదువేలు యిస్తారట" అన్నాడు.

'అవునులే! రాజాలాంటి పిల్లాడు. ఇవ్వకేం జేస్తారు' అనుకుంది మనసులో వరహాలమ్మ.

భోజనం చేసి కాస్సేపు నిద్రపోయిలేచాడు ప్రభాకరం. సరోజ టీ పట్టుకొచ్చి యిస్తే తాగుతూ " ఇంకా మీ ఆయన దగ్గరకు పంపించలేదా?"అని అడిగాడు.

సన్నగా వినీవినపడనంత నెమ్మదిగా "ఊహు" అని ఖాళీకప్పు అందుకుని వెళ్ళిపోయింది.

ధర్మయ్య ఎప్పుడో నాలుగు గంటలవేళ వచ్చి ప్రభాకరాన్ని పలకరించి కాస్సేపు అక్కడి విషయాలవీ మాట్లాడి,ఆరింటికి పనుందని, రాత్రి రావడం ఆలస్యమౌతుందని చెప్పి వెళ్ళిపోయాడు.

ప్రభాకరం సాయంకాలంపూట యింట్లో కూర్చోలేక అలా అవతలకు షికారుకు వెళ్ళి వస్తానని బయలుదేరాడు. ప్రభాకరం బయలుదేరడం చూసి వరహాలమ్మ ఆ వీధిలో ఎవరింట్లోనో త్రినాథస్వామి పూజకని వెళ్తూ బావవస్తే పిలవ్వే అని చెప్పి వెళ్ళిపోయింది.

సరోజ ఒక్కర్తికీ యింట్లో ఏంచేయడానికీ తోచక వీధి గదిలోకొచ్చి కిటికీముందు

కూర్చుంది. వీధిలో కుర్రాళ్ళు వేపచెట్టుకింద గాలికి రాలిన వేపపళ్ళను ఏరుకుంటున్నారు. అదిచూస్తుంటే ఆమెకు తన బాల్యం గుర్తొచ్చి కళ్ళు చెమర్చాయి.

చిన్నప్పుడు ప్రభాకరం, సరోజ అలానే సాయంకాలంవేళల్లో గట్టిగా గాలులు వీచినప్పుడు వేపపళ్ళు ఏరుకు తినేవారు. తన ఒడినిండా యిన్ని పళ్ళు ఏరుకొచ్చి ఓచోట తిందామని కూర్చుంటే ప్రభాకరం వెనకనించి వచ్చి గుప్పెడు పళ్ళు లాక్కుపోయేవాడు. తను ఏడిస్తే అత్తయ్య వచ్చి వాడిని నాలుగుతన్ని ఆమెకవి యిప్పిస్తుండేది. ఎంత చక్కటి రోజులవి! చీకూచింతా లేనిరోజులు. ఆ రోజులిక తిరిగిరావు.

ఆలోచిస్తూ కూర్చున్న సరోజ ముఖంమీద వర్షపుజల్లు కొట్టింది. బైట చినుకులు మొదలై, చూస్తుండగానే చింతపిక్కలంత పరిమాణంలో వర్షం కురుస్తోంది. కుర్రాళ్ళంతా ఎవరికి దగ్గర్లో వున్న అరుగులు వాళ్ళెక్కి నుంచున్నారు. వీధివీధంతా నిర్మానుష్యమై పోయింది. నీళ్ళు రోడ్డుమీద కాలవలుకట్టి పారుతున్నాయి.

సరోజ అలా వీధిలోకి చూస్తుండగానే ప్రభాకరం ఆ చివరనుడి పెద్దపెద్ద అంగల్తో వర్షంలో తడుస్తూ వస్తుండడం కనిపించి గబగబా వీధి అరుగుమీదకువచ్చి నుంచుంది. బావని చూస్తోంటే నవ్వాగింది కాదు సరోజకు. పకాపకా నవ్వుతూ " తడుస్తూ వచ్చావేం బావా! ఎక్కడన్నా వర్షం తగ్గేవరకూ ఆగలేకపోయావ్?" అంది.

"ఏదీ, ఆ వంతెన దాటకుండానే వర్షం పట్టుకొంది. ఎక్కడని ఆగేది, అంతా కొత్త" వణికిపోతున్న కంఠంతో సగం అక్షరాల్ని మింగి అన్నాడు.

సరోజ లోపలికి పోయి తువ్వాలు పట్టుకొచ్చి "రా బావా లోపలికి వచ్చి తుడుచుకో" అంది.

అతను చొక్కా, బనీను తీసేసి తల తుడుచుకుంటుంటే ఓ పక్కగానుంచొని గజగజా వణికిపోతున్న ప్రభాకరాన్ని చూసి "చలేస్తున్నట్టుంది. వుండు, వేడివేడి టీ పట్టుకొస్తాను" అని వంటగదిలోకి వెళ్ళింది.

అయిదునిమిషాల్లో పొగలుకక్కుతున్న టీ పట్టుకొచ్చి యిచ్చింది సరోజ. అప్పటికి ప్రభాకరం తలతుడుచుకుని తడిసిపోయిన ఫేంటుకూడా తీసేసి లుంగీ కట్టుకుని కూర్చున్నాడు.

సరోజ యిచ్చిన కప్పును అందుకొని తాగుతూ మధ్యమధ్య తనవైపే చూస్తూ, తను చూస్తుంటే చటుక్కున దృష్టి మార్చుకుంటున్న సరోజను చూస్తూ కప్పు ఖాళీచేసి ఆమెకు అందించాడు. సరోజ అందుకుని చెయిజారి కిందపడబోయిన కప్పును చటుక్కున ముందుకువంగి పడకుండా పట్టుకుని పక్కన స్టూలుమీదపెట్టి, ఏం మాట్లాడ్డానికీ తోచక చూస్తూ వుండిపోయింది. ఓ నిమిషం తర్వాత కిటికీలోంచి వాలుగా వర్షం తుంపర్లు లోపలికి రావడం గమనించి కిటికీ రెక్కలు రెండూ మూసి వచ్చింది.

"ఎప్పుడెళ్తున్నావ్ మీ ఆయన దగ్గరికి?" ప్రభాకరానికి అలా నిశ్శబ్దంగా కూర్చోవడం యిబ్బందిగా అనిపించి సంభాషణలోకి దించుదామని అడిగాడు.

"అన్నట్టు యీ మధ్యనే ఉద్యోగంలో చేరేవట. నాన్న చెప్పాడు. జీతం ఎంత?"

ప్రభాకరం సమాధానం చెప్పాడు. ఆమె అంతటితో ఆగిపోలేదు. ప్రశ్నలమీద ప్రశ్నలు వేస్తోంది. అతనుచెప్తున్నాడు. చెప్తున్నాడేగాని అతని దృష్టి ఆ ఎదుటిగోడమీద వుంది. ఆ గోడమీద నాలుగైదు ఫొటోలు వేలాడుతున్నాయి. సరిగ్గా ఆమె కూర్చున్నచోటే తలమీద రాధాకృష్ణుల ప్రణయసన్నివేశం చిత్రకారుని రంగుల్లో కళ్ళను ఆకట్టుకుంటోంది. అతను దానినే చూస్తున్నాడు. అస్తమిస్తోన్న సూర్యుడు, అలముకొంటున్న చీకటి, ఆమధ్య ప్రకృతిలో కరిగిపోయిన నీలవర్ణంలో మురళివాయిస్తూ శ్రీకృష్ణుడు, అతని వడిలో రాధ– సోలిపోయిన కళ్ళూ, చెదిరిపోయిన పవిటా, వీడిపోయిన కేశబంధం! వారిచుట్టూ పూల గుబురులతో నిశ్చలమైన ప్రకృతి!

ప్రభారం దృష్టి సరోజమీదకు మళ్ళింది. కుర్చీకోడిమీద చేతినుంచి, ముఖాన్ని అరచేతిమీద ఆన్చి కిందకుచూస్తూ కాలిగోటితో నేలమీద రాస్తూవుంది. ప్రభాకరం తన దృష్టిని ఎంత మార్చుకుందామన్నా సరోజనుండి మార్చుకోలేకపోతున్నాడు.

ఆమె తలలో వాడని మల్లెలు, గదిలో మంచం, చుట్టూ చలిగాలి, ఎదురుగా మనసును ఉత్తేజపరిచే ప్రణయసన్నివేశం, ఇంట్లో మరెవరూలేని అవకాశం!

అతని కళ్ళల్లో దాహాన్నీ, ముఖంలో ఉద్విగ్నతనీ గుర్తించి వెళ్ళిపోదామని లేచినుంచొని ఏదో చెప్పబోయి 'బావా' అంది.

ప్రభాకరం తలుపు గెడపెట్టివచ్చి భుజంపట్టి కూర్చోపెట్టి ఆమె కళ్ళల్లోకి చూశాడు

సరోజ బిత్తరపోయింది.

ప్రభాకరం ఆమెను గుండెలకు హత్తుకున్నాడు.

ఆమె ఏదో గొణిగింది.

అతను వినిపించుకోలేదు. మరింతగా ఆమెను దగ్గరకు లాక్కున్నాడు. సరోజకూడా మరేమీ అడ్డుచెప్పలేదు. అతని కంఠం చుట్టూ గట్టిగా చేతులు పెనవేసుకుంది.

ఆ మర్నాడే ప్రభాకరం వెళ్ళిపోయాడు. మరోరోజు వుండమని అత్తయ్య, మామయ్య చెప్పిచూశారుగాని అర్జంటుపని వుందని వెళ్ళిపోయాడు.

నాలుగురోజుల తర్వాత ఓ సాయంకాలం తీరిగ్గా తల్లీ తండ్రీ వీధివరండాలో కష్టసుఖాలు మాట్లాడుకుంటుంటే దీపం వెలిగించడానికని అటొచ్చిన సరోజను చూసి యధాలాపంగా అడిగింది తల్లి. "మామయ్యకి నిన్ను తీసుకెళ్ళడానికి రమ్మని ఉత్తరం రాస్తానంటున్నారే నాన్న, రాయమంటావా?" అని.

"సరే, రాస్తేరాయండి" అన్నట్టుగా తలాడించింది సరోజ.

కూతురు అంగీకరించడం వాళ్ళకు ఆశ్చర్యంగానేవుంది. కారణం ఏమిటో తెలీకపోయినా, కూతురు కాపరానికి వెళ్ళడానికి అంగీకరించినందుకు సంతోషంతో యిద్దరూ సరోజవైపు చూశారు. సరోజ వెనక్కుతిరిగి వాళ్ళకు కనబడకుండా ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ మెల్లగా గదిలోకి వెళ్ళిపోయింది.

✪